ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 26 : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 173 ప్రజా ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్పొరేషన్ అధికారి మల్లేశం, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి రామ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. వీటిలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు, ఆసరా పింఛన్, పంచాయతీరాజ్, డిస్ట్రిక్ ట్రైబల్ వెల్ఫేర్, మెడికల్ డిపార్ట్‌మెంట్, డిస్ట్రిక్ అగ్రికల్చర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీస్, ఈఈ పీఆర్, ఇంజినీరింగ్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్ లో ఉంచరాదని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి హాజరైన జిల్లా అధికారులు

## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా 'పొదుపు చేయడం అలవాటు చేసుకోండి, ఆర్థిక లాభాలనార్జించండి, సైబర్ స్మార్ట్ అవ్వండి' అనే వాల్‌పోస్టర్లను బ్యాంకు అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. 28, 29 తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే అవగాహన కార్యక్రమంలో వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాల్ పోస్టర్ల ఆవిష్కరణలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, వివిధ బ్యాంకుల మేనేజర్లు శ్రావణి, గంగాధర్, శృతి, మమత, సర్వ రాజు, హఫీజ్, నవాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి విన్నవించి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు.

## విద్యార్థుల ఆత్మహత్యా ప్రయత్నాలు అరికట్టడంపై శిక్షణ

షాబాద్, ఫిబ్రవరి 26 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పనిచేస్తున్న వసతి గృహ అధికారులకు విద్యార్థుల ఆత్మహత్యా ప్రయత్నాలను అరికట్టడానికి, సంక్షేమ హాస్టళ్లలో మానసిక శ్రేయస్సు తదితర అంశాలపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నగరంలోని కొత్తపేట బాబూ జగ్జీవన్‌రాం భవన్ కొత్తపేటలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, టీం కోఆర్డినేటర్ కరుణాకర్, సీడీపీవో హర్షవర్ధిని హాజరయ్యారు. సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వసతి గృహ అధికారులకు విద్యార్థుల మానసిక స్థితికి సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు యాదయ్య, రామారావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మృతులు లక్ష్మణ్, లక్ష్మి

### మరణంలోనూ వీడని బంధం

## విద్యుదాఘాతంతో దంపతులు మృతి

### ఇంటి ఆవరణలో

### బట్టలు ఆరేస్తుండగా ప్రమాదం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 26 : నూరేళ్ల బతకాలని ఏడడుగులు కలిసి నడిచారు ఆ దంపతులు. కూలీపనులు చేసుకుని జీవిస్తున్న ఆ పేద దంపతులను మృత్యువు వెంటాడింది. మరణంలోనూ కలిసే తనువు చాలించారు ఆ దంపతులు. విద్యుదాఘాతంతో భార్యాభర్తలు మృతిచెందిన విషాద సంఘటన సోమవారం వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బురాన్‌పూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై అబ్దుల్ రవూఫ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని లక్ష్మణ్(48), బోయిని లక్ష్మి(40) భార్యాభర్తలు. వీరు కూలీ పనులు చేసుకుని బతుకుతున్నారు. సోమవారం ఉపాధి పనులకు వెళ్లాలని బట్టలు ఉతికి ఇంటి ఆవరణలో రేకుల కింద పైపులకు కట్టిన ఇనుప తీగపై ఆరేయడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. అదే గ్రామానికి చెందిన మహిళ వీరి ఇంటికి వచ్చి చూసేసరికి భార్యాభర్తలు ఇద్దరు విగత జీవులై పడి ఉన్నారు. మృతిచెందిన దంపతులకు ఒక కొడుకు సిద్ధార్థ్, కూతురు ఉన్నారు. కూతురు వివాహం కాగా కొడుకు పరిగిలో డిగ్రీ చదువుతున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రవూఫ్ గ్రామానికి చేరుకొని ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి దవాఖానకు తరలించారు. మృతుడు లక్ష్మణ్ అన్న రాంచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భార్యాభర్తల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా వీరి ఇంటికి సమీపంలో ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ లేనందునే ఇంటికి విద్యుత్ షాక్ వచ్చిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకున్న పలువురి ఇండ్లల్లో కూడా షాక్ వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ నాగరాజును వివరణ కోరగా.. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ సమస్య లేదని, ఇంట్లో ఇంటర్నల్ వైరింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు.

## ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

### వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 26 : ఇంటర్ పరీక్షల సందర్భంగా జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. ఎవరు కూడా పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడవద్దన్నారు. ఎవరైనా కేంద్రాల వద్ద చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కలా ఉన్నటువంటి జిరాక్స్ కేంద్రాలు పరీక్షల సమయంలో మూసివేయాలని సూచించారు. వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 11, పరిగి సబ్ డివిజన్ పరిధిలో 9, తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 9 పరీక్షా కేంద్రాలు మొత్తం జిల్లాలో 29 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయంపై దృష్టి సారించి పోలీస్ అధికారులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# రైల్వేస్టేషన్‌లకు ఆధునిక హంగులు

- వికారాబాద్ రైల్వేస్టేషన్‌కు రూ.24.35 కోట్లు
- షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌కు రూ.9.59 కోట్లు
- పనులు వేగంగా చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- రైల్వే సౌకర్యాలు మరింత మెరుగుపడాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నరేంద్రమోదీతోనే రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి సాధ్యం
- బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- రైల్వేస్టేషన్ల ఆవరణల్లో 'అమృత్ భారత్' కార్యక్రమం

వికారాబాద్, ఫిబ్రవరి 26 : వికారాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.24.35 కోట్లతో పనులను చేపట్టి త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద వికారాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో.. స్కీమును వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. మంజూరైన నిధులతో రైల్వే స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలన్నారు. ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవడానికి గది నిర్మించాలని సూచించారు. ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రైల్వే స్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, ప్లాట్ ఫామ్, టాయిలెట్స్ నిర్మాణాలు, దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ఏ మాత్రమూ సహకరించలేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వికారాబాద్ రైల్వేస్టేషన్‌కు ప్రత్యేకంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులు సంవత్సరంలో పూర్తవుతాయన్నారు. ఎంఎంటీఎస్ రైలును శంకర్‌పల్లి, వికారాబాద్ వరకు పొడిగించేందుకు ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. త్వరలో తాండూరు రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి 50 శాతం నిధులు తీసుకొస్తామని, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మంజూరు చేయాలని సూచించారు. వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్, వైఫై, మూత్రశాలలు, ఓవర్ బ్రిడ్జి వంటి తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## నిధుల మంజూరుపై హర్షం

షాద్‌నగర్ : ప్రజల అవసరాలకు అనుగుణంగా షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో రైల్వే సౌకర్యాలు మరింత పెరగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లోని రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అమృత్ భారత్‌ను దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. షాద్‌నగర్ రైల్వేస్టేషన్ ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.9.59 కోట్ల నిధులను మంజూరు చేయడం హర్షదాయకమన్నారు. షాద్‌నగర్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని, అన్ని రకాల రైళ్లు ఆపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చటాన్‌పల్లి రైల్వే వంతెన నిర్మాణ పనులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. రైల్వే పట్టాల కింద నిర్మించే వంతెనలతో ప్రజలకు ఉపయోగం లేకుండా పోతున్నదని, వర్షాకాలంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. రతన్ కానీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా రైల్వే శాఖ అధికారులు చొరవ చూపాలని, గత కొన్నాళ్లుగా ఉన్న రోడ్డు మార్గానికి ఇబ్బందులు కలిగించడం సరికాదని చెప్పారు. చటాన్‌పల్లి రైల్వే వంతెన నిర్మాణ తీరును మార్చేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్యముదిరాజ్, నాయకులు వెంకటేశ్‌గుప్తా, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మోహన్, గోపాల్‌గుప్తా, మనోహర్‌రెడ్డి, వెంకటేశ్, రైల్వే శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# బదిలీలలో తికమక

### ముందు చూపులేని ప్రభుత్వం

### పట్టుసాధిస్తున్న క్రమంలో అధికారుల మార్పు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : పోలీసు ఉన్నతాధికారుల బదిలీల్లో ప్రభుత్వం 'తిక్క శంకరయ్య'లా వ్యవహరిస్తున్నదని పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తరువాత పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు చేశారు. అయితే, పార్లమెంట్ ఎన్నికలు మరికొన్ని రోజుల్లోనే ఉన్నా... నియమ నిబంధనల గూర్చి కనీసం అవగాహన లేకుండా.. ఏ మాత్రం ముందుచూపు లేకుండా ఇష్టానుసారంగా బదిలీ చేశారు. తీరా పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుండటంతో అధికారులను మారుస్తూ వస్తున్నారు. ఆయా విభాగాలపై పట్టు సాధిస్తున్న క్రమంలో ఒక్కో అధికారిని తమ ఇష్టానుసారంగా మారుస్తుండటంతో డిపార్టుమెంట్‌లో ఏమి జరుగుతుందో పోలీసులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది.

- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నియమించింది. ఆయన కమిషనరేట్‌పై పట్టుసాధిస్తున్న క్రమంలో బదిలీ చేశారు. గతంలో ఇదే కమిషనరేట్‌లో జాయింట్ సీపీగా పనిచేయడం, తిరిగి అదే కమిషనరేట్‌కు కమిషనర్‌గా వెళ్లడంతో గత పార్లమెంట్ ఎన్నికలకు, ఈ పార్లమెంట్ ఎన్నికలకు మధ్య మూడేండ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసినట్లు తేలింది. ఈ సాంకేతిక కారణంతో ఆయనను బదిలీ చేసినట్లు సమాచారం.
- తాజాగా.. హైదరాబాద్ నగర అదనపు పోలీస్ కమిషనర్ ఏవీ. రంగనాథ్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానికుడని, అందుకే హైదరాబాదేతర ప్రాంతానికి బదిలీ చేయాలనే నిబంధన మేరకు వరంగల్ ఐజీగా బదిలీ చేసినట్లు సమాచారం. అలాగే, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్‌ను కూడా బదిలీ చేశారు. నగర పోలీస్ కమిషనరేట్‌కు గుండెకాయలాంటి క్రైమ్, ట్రాఫిక్ విభాగాధిపతులిద్దరినీ బదిలీ చేయడం గమనార్హం. ఈ ఇద్దరు అధికారులు తమ విభాగాలపై పట్టు సాధించారు. సీసీఎస్ ప్రక్షాళనతో పాటు సైబర్‌నేరాల కట్టడికి, దర్యాప్తులో తగిన ప్రణాళికలు రూపొందించి.. సిబ్బందికి రంగనాథ్ దిశా నిర్దేశం చేశారు. అలాగే, నగరంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా పకడ్బందీగా సిబ్బందిని ట్రాక్‌లోకి తీసుకురావడంలో విశ్వప్రసాద్ ప్రయత్నిస్తూ.. ఫలితాలు రాబడుతున్నారు.
- సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేస్తున్న శరత్ చంద్ర పవార్‌ను నార్కోటిక్ బ్యూరోకు బదిలీ చేశారు. ఈ అధికారి కూడా హైదరాబాద్ స్థానికతకు సంబంధించిన అంశంలోనే బదిలీ చేశారు. కీలకమైన సెంట్రల్ జోన్‌పై శరత్ చంద్ర పూర్తి పట్టు సాధించారు. ఇంతలో ఆయన బదిలీ కావడంతో సిబ్బంది షాక్‌కు గురయ్యారు.
- గతంలో పలువురు ఐపీఎస్, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను కూడా బదిలీ చేస్తూ, తిరిగి ఆ బదిలీలను రద్దు చేస్తూ మరో చోటకు బదిలీ చేస్తూ.. బదిలీల వ్యవహారాన్ని ఒక కిచిడిలా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## అధికారులను కస్టడీకి కోరుతూ.. పిటిషన్ దాఖలు చేసిన ఏసీబీ

### రూ. 2.10కోట్ల నిధులపై విచారణ

### సయ్యద్ మొహినుద్దీన్, సయ్యద్ ఇక్రమొద్దీన్‌ల అరెస్టు

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన 21 లక్షలు వినియోగం

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించి, అవినీతికి పాల్పడిన నలుగురు అధికారులను విచారించేందుకు ఏసీబీ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సోమవారం అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. కామారెడ్డి పశువుల ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మపురి రవి, మేడ్చల్ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్యశేషసాయి, రంగారెడ్డిజిల్లా గ్రౌండ్‌వాటర్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ పసుల రఘుపతిరెడ్డి, నల్గొండ వయోజన విద్యాధికారి సంగు గణేశ్‌ను 5 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టుకు పీపీ వాదనలు వినిపించారు. ప్రధాన నిందితులు సయ్యద్ మొహినుద్దీన్, సయ్యద్ ఇక్రమొద్దీన్‌ను అరెస్టు చేసేందుకు పూర్తి సమాచారాన్ని సేకరించాలని, పైవేటు వ్యక్తులుగా, ఏజెంట్లుగా వీరిద్దరి పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ నిధులు రూ.2.10 కోట్ల ధనం దుర్వినియోగం పట్ల విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 7న ప్రధాన నిందితుడు సయ్యద్ మొహినుద్దీన్ ఇంట్లో సోదాలు నిర్వహించగా.. గొర్రెల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల జాబితా పత్రాలు, గొర్రెల క్రయవిక్రయానికి వినియోగించిన నిధులకు సంబంధించిన 90 పత్రాలు, గొర్రెల బీమా సర్టిఫికెట్లకు చెందిన బుక్‌నం.1626, మేడ్చల్- మల్కాజిగిరి పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారికి 16 గొర్రెల యూనిట్లుకూనూ జిల్లా కలెక్టర్ 2023 ఆగస్టులో మంజూరు చేసిన 21 లక్షల వినియోగం, లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ పత్రాల సాక్ష్యాధారాలు లభించాయని, వాటన్నింటినీ ఏసీబీ అధికారులు జప్తు చేసినట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. వీటన్నింటిపై అధికారుల వివరణ తీసుకోవాల్సి ఉన్నదన్నారు. ప్రజాధనాన్ని చట్ట వ్యతిరేకంగా, ఉద్దేశపూర్వకంగా నకిలీ బినామీ అకౌంట్లను తయారు చేసి.. నలుగురు అధికారులు అవినీతికి పాల్పడినట్టు కోర్టుకు తెలిపారు. జనవరి 1, 2024లో అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన అధికారులు.. పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతరులను అదుపులోకి తీసుకోనున్నారు. మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం ఉంది.

# హెచ్‌ఎండీఏ భూముల లెక్కలు తేల్చండి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో భూముల లెక్కలు తేల్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం హెచ్ ఎండీఏ కార్యకలాపాలపై ప్రధానంగా దృష్టి సారించింది. ఇప్పటికే ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్, ల్యాండ్‌పూలింగ్ విభాగాలపై పలుమార్లు మెట్రోపాలిటన్ కమిషనర్ నేతృత్వంలో సమీక్షలు నిర్వహించారు. ఇటీవల ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న మొత్తం భూముల వివరాలు కావాలని కోరారు. దీంతో మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ హెచ్‌ఎండీఏ ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులకు భూముల లెక్కలతో సమీక్షకు రావాలని ఆదేశించారు. ఈమేరకు ఎస్టేట్ విభాగంలోని ఉన్నతాధికారులు, ఉద్యోగులంతా ఆదివారం కూడా అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వచ్చి భూముల వివరాలపై నివేదికను సిద్ధం చేసుకున్నారు. సోమవారం మెట్రోపాలిటన్ కమిషనర్ ఎస్టేట్ ఆఫీసర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టి మహ్మద్ అసదుల్లాతో పాటు ఇతర అధికారులతో హెచ్‌ఎండీఏకు చెందిన భూములపై ప్రధానంగా చర్చించారు. ప్రధానంగా నగర శివారులోని జవహర్‌నగర్‌లో హెచ్‌ఎండీఏకు 3వేల ఎకరాల వరకు ఉండగా, అందులో చాలా పెద్ద మొత్తంలో కబ్జాలు కాగా మిగిలిన భూముల పరిస్థితిపై చర్చించారు. అదేవిధంగా శంషాబాద్, మియాపూర్, బుద్వేల్, కోకాపేట, వట్టినాగులపల్లి, ఉప్పల్ భగాయత్ ప్రాంతాల్లో మొత్తం ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయి, వాటిపై ఉన్న కేసులు వివరాలను అడిగారు. దీనికి ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులు మొత్తం భూముల వివరాలపై నివేదికను రూపొందించి ఇస్తామని మెట్రోపాలిటన్ కమిషనర్‌కు తెలిపారు.

## ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు.. 71 మంది ఎస్‌ఐల బదిలీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరంలో పోలీసు అధికారుల బదిలీల పరంపర కొనసాగుతోంది. అయితే కొత్త పోస్టింగ్‌ల్లో చేరి, సర్దుకునే లోపే మళ్లీ బదిలీలు కావడంతో అధికారులు బేజారవుతున్నారు. మొన్నటికి మొన్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూడు కమిషనరేట్ల పరిధిలో ఎస్ఐ నుంచి కమిషనర్ స్థాయి అధికారుల వరకు దాదాపు సిబ్బందిని బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో మరోసారి బదిలీలు తప్పలేదు. అంతలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఇప్పుడు మళ్లీ అధికారుల బదిలీ పరంపర మొదలైంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ పరిధిలో తాజాగా 71మంది ఎస్ఐలు, 7మంది సీఐలను బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ కే.శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సీఐల బదిలీల విషయానికి వస్తే గోపాలపురం ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న తవిటి నర్సింగ్‌రావును చార్మినార్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా, మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డిని గోపాలపురం ఎస్‌హెచ్‌వోగా, మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వోను ఎస్‌బీ 3వ బెటాలియన్‌కు, మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్‌ను మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా, గోపాలపురం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎస్.సైదులును చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్‌వోగా, మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరాములును గోపాలపురం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. కాగా చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్‌వో వై.ప్రకాశ్‌రెడ్డిని మల్టీజోన్-2కు సరెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



కన్హాలో కోర్ కమిటీ సభ్యులతో కేంద్ర న్యాయ, సాంస్కృతిక శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

## ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

### కేంద్ర న్యాయ, సాంస్కృతిక శాఖల మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

నందిగామ, ఫిబ్రవరి 26 : ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన కేంద్రమైన కన్హాశాంతి వనంలో నిర్వహించనున్న ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని క